సీరియల్

# అగ్ని కెరటం

## ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

భారత్ కు ఆ ఆర్తనాదం వినపడింది.

బాధ కలిగింది. అప్పుడే యిద్దరు మనుషులను టకారాలు చంపేశారు.

ఆ ఆక్రందన వినగానే ఇక ఒక్క సెకనుకూడా సెల్లా ఆలస్యం చెయ్యలేదు. చెవిదాకా లాగి వదిలిపెట్టిన బాణంలా ఒక్కసారి ముందుకు పరుగెత్తింది.

పరుగుదీయటంలో చదువుకునేటప్పుడు సెల్లా యెన్నో బహుమతులు గెల్చుకుంది.

ఆ స్త్రీ ఏమైపోయినా తనకు పనిలేదు. అంతా ఆమె దురదృష్టం. ఆమె ప్రాణాలు కాపాడటానికే తను యెంతో రిస్కు తీసుకుంది. కాని అందువల్ల ఉపయోగం లేకుండా పోయింది. ఆమెతో ముడిపెట్టుకుంటే తన ప్రాణాలు కూడా యెగిరిపోతాయి.

కొన్ని క్షణాల్లోనే ముందు వెళుతున్న మనుషులను కలుసుకుంది. కలుసుకుంటూనే అరిచింది. "ఇంకా వేగంగా పరిగెత్తండి. టకారాలు దగ్గరకు వస్తున్నారు. అప్పుడే ఇద్దరి ప్రాణాలు తీసేశారు."

శైలా అలా అనేసరికి ఆయాసంతో — అలసటతో రొప్పుతున్న వాళ్ళు కూడా పరుగు వేగాన్ని యింకా పెంచారు.

ఆ చెట్లకింద చీకట్లో కొంచెం కూడా అస్పష్టంగా వినా యేదీ కనిపించటంలేదు. చెట్లమధ్యనించి జాగ్రత్తగా పరిగెత్తుతున్నాడు భారత్. అతను వెనక్కి తిరిగి చూడకుండానే అందర్నీ త్వరగా రమ్మని పరుగుతీస్తున్నాడు.

శైలా సగం మందిని దాటింది.

ఇంతలోనే యెవరో చీకట్లో ఒక చెట్టును ఢీకొని బాధగా అరిచారు. తర్వాత దబ్ మన్న చప్పుడు వినపడింది. ఆయనే ముసలాయన. మొహం చెట్టుకు కొట్టుకోవటంతో కళ్ళు తిరిగాయి. కిందపడిపోయాడు అయినా వెంటనే లేవలేకపోయాడు. అప్పటికే మిగిలిన వాళ్ళు ముందుకు వెళ్ళిపోయాడు.

వెనుకనించి టకారాల అరుపులు, అడుగుల చప్పుళ్ళు వినపడుతున్నాయి. గబగబా లేచే ప్రయత్నం చేశాడు. కాని సాధ్యం కాలేదు. అవయవాలు స్వాధీనంలోకి రాలేదు.

దగ్గరికి వస్తున్నారు టకారాజాతి మనుషులు. లేవాలి, పరుగుతీయాలి. ప్రాణాన్ని కాపాడుకోవాలి. ఎంతగా అనుకున్నా కొంచెంకూడా లేవలేకపోయాడు ఆయన.

సెకన్లలో టకారాలు దగ్గరకు వచ్చేశారు.

చీకట్లో వున్న ముసలాయన ఊపిరి తీస్తున్న శబ్దం

వినపడింది. అంతే—బల్లెం పైకి లేచింది. వెనువెంటనే ముసలాయన చావుకేక ఆ దీవినంతటినీ కలచివేసింది.

ముందు పరిగెత్తుతున్న వాళ్ళంతా బిగుసుకుపోయారు. టకారాలు తమని కూడా ప్రాణాలతో వదలరనే నమ్మకం వాళ్ళకు బలంగా కలిగింది.

సరిగ్గా అప్పుడే పులిగాండ్రింపు వినిపించింది.

పరిగెత్తుతున్న వాళ్ళంతా ఒక్కసారి ఎవరో పట్టి ఆపినట్టుగా ఆగిపోయారు.

అంతా చీకటి. ఆ చీకట్లో పులి యెక్కడ వుందో తెలీదు. ఎక్కడ? ఎదురుగా వుందా?

భారత్ కూడా ఆగిపోయాడు. పరిగెడుతూనే సెల్లా "భారత్" అంటూ అరిచింది.

"సెల్లా....క్విక్....ఎక్కడో దగ్గర్లోనే పులి పొంచి వుంది."

మళ్ళీ పులి గాండ్రించింది-ఈసారి ఇంకొంచెం దగ్గిర్నించి వినపడింది.

ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేకపోయారు. ఎక్కడ నిల్చున్నవాళ్ళు అక్కడనే.

ఎండుటాకుల మీద జంతువేదో పరుగెత్తుతున్న చప్పుడు వినపడింది. పులి దగ్గరకు వస్తోంది—ఈ ఆలోచన రాగానే మళ్ళీ ముందుకు పరుగుతీయబోయారు.

అప్పటికే వెనకనించి టకారాలు బాగా దగ్గరకు వచ్చేశారు.

నాగరికులు పులి గాండ్రింపు విని ఆగిపోవటం టకారాలకు తెలిసిపోయింది.

ఒకడు బల్లెం విసిరాడు.

సూటిగా వచ్చి పరుగుదీయబోతున్న మనిషి తలలో

దిగబడింది. ఆయువుకూడా బయటకు రాలేదు. తలను చీల్చుకొని బయటకు వచ్చింది. అక్కడికక్కడే కూలి పోయాడతను మొదలు నరికిన చెట్టులా.

తమ పక్కనే ఓ మనిషి కూలిపోవటం వాళ్ళకు తెలిసింది. పులి పక్కనే చెట్ల మధ్యనించి వస్తోందని ఆకుల చప్పుడుతో తెలుసుకుని ముందుకు పరుగుతీశారు.

అప్పటికే ఆలస్యమయ్యింది. పులి చీకట్లోనే వచ్చి ఒక్కసారి పైకెగిరి వాళ్ళమీదకు దూకింది.

కింద పడిపోయారు అరున్నూ. వాళ్ళ చేతిలో ఆయుధాలు చీకట్లో దూరంగా పడిపోయాయి. ఆయుధాలు వున్నా వాటితో పులిని యెదిరించి దాన్ని చంపగలిగే ధైర్యసాహసాలు ఎవ్వరికీ లేవు వారిలో.

కిందపడకుండా మిగిలిన వాళ్ళు చెల్లాచెదురైనారు. దిక్కుతోచక యెవరికి తోచినట్టుగా వాళ్ళు పరుగెత్తిబోయారు.

చెట్లకు తగులుకుని పడిపోయారు.

పులి అప్పటికే కిందపడిన వ్యక్తిని గాయపరిచింది. అతను మృత్యు భయంతో పిచ్చిపట్టినట్టు కేకలు పెడుతున్నాడు.

టకారాలు పూర్తిగా దగ్గరకు వచ్చేశారు. రావడంతోనే ఒక్క నిమిషంకూడా ఆలస్యం చెయ్యకుండా కిచకిచల భాషలో ఏదో అంటూ చేతికి దొరికిన మనుషులను దొరికినట్టు వంకీ కత్తులతో నరికేశారు. కొంత మందికి చేతులు తెగిపోయాయి. మరికొంతమందికి తలలు పగిలిపోయి కత్తులు మెడవరకూ దిగబడిపోయాయి.

వాళ్ళకు దగ్గర్లోనే పులి అతడి పీకనూ కొరికేసింది. ఘోరంగా వుంది పరిస్థితి. (సశేషం)